460) దేవగాంధారి

ప॥ వానికి ముదుల యిచ్చి వద్దని మానుపవే । శ్రీనారాయణ వీనిచేత నే వేసరితి ॥

చ॥ నీకల్పితములే యీ నిఖిలేంద్రియములు । యీకడ నీయింద్రియాల నెట్టు గెలువగవచ్చు ।
నీకడ నిన్నే కొలిచి నీయప్పణ దెచ్చి వాని । బైకొని చోపుటగాక బలిమా రాచాజ్ఞతో ॥

చ॥ నీపంపునగప్పిననిజమైనమాయ యిది । మాపాటివారెల్లా మహి నెట్టు దాటవచ్చు ।
మీపాదాలే కొల్చి మీయనుజ్ఞ గొని దాని । పైపై దోయుటగాక బలిమా రాచాజ్ఞతో ॥

చ॥ శ్రీవేంకటేశ నీచిక్కులే యీపుట్టుగలు । నీవు సేసేచేతలకు నే నెట్టు దొలగవచ్చు ।
నీవొద్ద శరణంటే నీయానతినే వాని । భావించి తోసితిగాక బలిమా రాచాజ్ఞతో ॥